www.prajapakshamnin
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 21 | మే | 2026
పేజీలు : 6

ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియకు

## రాజకీయ పార్టీల సహకారం అవసరం

బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలు వెంటనే సమర్పించాలి : కలెక్టర్ అంకిత్



సెంటర్‌స్ప్రెడ్

# పింఛన్లలో కోత..!

-నూతన పింఛన్లపై సందిగ్ధత
-ప్రభుత్వ హామీకి తూట్లు
-పెంపుదల పైన అనుమానాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల సంఖ్యను పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో కొత్త పింఛన్లపై అర్హులు ఎన్నో ఆశలు పెంచుకున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఉన్న పింఛన్లలో కోత పెడుతున్నట్లుగా కనిపిస్తుంది. జూన్ రెండు నాటికి కొత్త పింఛన్లను మంజూరు చేస్తారన్న వార్తల నేపథ్యంలో ఇప్పుడు జరుగుతున్న ఇంటింటి సర్వే ద్వారా మరి కొంత మందిని తొలగించే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2025 మార్చి నాటికి 1.98 లక్షల మంది పింఛన్లు రద్దయ్యాయి. గత ప్రభుత్వం అనర్హులకు పింఛన్లు ఇచ్చిందన్న కారణంతో వీటిని తొలగించినట్లు సమాచారం. 2024 అక్టోబర్ నాటికి 44,49,769 మంది పింఛన్‌దారులు రాష్ట్రంలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్‌ను నాలుగు వేల రూపాయలకు పెంచుతామని

మిగతా 2లో..

## మందుల దుకాణాలు బంద్

-ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిలిచిన క్రయ విక్రయాలు
-ఆన్‌లైన్ విక్రయాలపై నిరసన







**ప్రజాపక్షం/ఖమ్మం :** కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపులు బుధవారం బంద్ పాటించాయి. ఆన్‌లైన్ వ్యాపారాలను నిరసిస్తూ 24 గంటల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మందుల విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అవసరమైన మందులు అందించేందుకు మాత్రం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఆన్‌లైన్ మందుల విక్రయాలు, డోర్ డెలివరి విధానానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. ప్రభుత్వం ఆన్‌లైన్ విక్రయాలకు సంబంధించి ఇచ్చిన జీవోను తక్షణం ఉపసంహరించుకోవాలని మెడికల్ షాపుల యజమానులు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో పలుమార్లు విజ్ఞప్తి చేసిన ఫలితం లేకపోవడంతో బంద్ పాటించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ విక్రయాల

మిగతా 2లో..

# భానుడి భగభగ..!

-50కు చేరువలో ఉష్ణోగ్రతలు





**ప్రజాపక్షం/ ఖమ్మం :** సూర్యుడు భగభగమండుతున్నాడు. వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించినట్లుగానే గడిచిన రెండు రోజులుగా ఎండ, వేడిమికి ప్రజలు తాళలేకపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. బుధవారం తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పారిశ్రామిక ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ముఖ్యంగా కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి, ఇల్లందు, కోయగూడెం, పాల్వంచ తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అధికార యంత్రాంగం ఉపశమన చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యాయి. ధాన్యం, మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలకు సంబంధించి రైతులు ఎండలో మగ్గిపోతున్నారు. కాంటాలు సరిగ్గా జరగకపోవడం లారీలు దొరక్క పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే సమయంలో పంట వ్యర్థాలను కాల్చే రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యర్థాలను కాల్చడం భూసారానికి ముప్పు తెస్తుందని సూచిస్తున్నారు. అధిక వేడిమి నుంచి రక్షణ పొందెందుకు ఉపశమన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

-యథేచ్ఛగా సాగుతున్న మట్టి అక్రమ రవాణా
-ట్రాక్టర్లకు ఇన్స్యూరెన్స్ లేదు, డ్రైవర్లకు లైసెన్స్ ఉండదు
-వ్యవసాయ ట్రాక్టర్లు, వ్యాపారానికి.. అడ్డు చెప్పని రవాణా శాఖ
-మట్టి అనుమతులు సరే, మరి మిగిలిన వాటి మాటేమిటి..?



## రైతుల ముసుగులో..
# చెరువులు లూటీ..!



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** పట్టణ, మండల పరిదిలోని చెరువులలో మట్టి దందా జోరుగా సాగుతుంది. రైతుల పేరిట అనుమతులు తీసుకుని పంటపోలాలకు తరలించాల్సిన మట్టిని వెంచర్లు, ఖాళీ స్థలాలు తదితర వాటికి తరలిస్తూ చెరువులను లూటీ చేస్తుంది ఓ ముఠా. ఒక్కో ట్రక్కు మట్టి రూ. 400 నుండి 500 కి అమ్ముతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని తామర చెరువు, వేశ్యకాంతల చెరువుతో పాటు మండల పరిధిలోని

మిగతా 2లో..

# పింఛన్లలో కోత..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించింది. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడిచినా పింఛన్ల పెంపుదల, కొత్త పింఛన్ల మంజూరు జరగలేదు. రెండు దఫాలుగా జరిగిన ప్రజాపాలనలో 24.85 లక్షల దరఖాస్తులు 11 కేటగిరీలకు సంబంధించిన పింఛన్లకు వచ్చాయి. ఒక ఖమ్మం జిల్లాలోనే 20వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పుడు పింఛన్లకు సంబంధించిన సర్వే నడుస్తుంది. అనర్హుల ఏరివేత కార్యక్రమం ప్రారంభమైంది. గతంలో రాజకీయ పలుకుబడితో అనర్హులు సైతం కొందరు పింఛన్లు పొందారు. ఇప్పుడు వారందరిని ఏరివేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. అయితే అనర్హుల ఏరివేత పేరుతో అర్హులకు అన్యాయం చేయరాదని ప్రజలు కోరుతున్నారు. అలాగే ప్రభుత్వం ఆసరా పింఛన్‌దారులకు 2016 రూపాయలు, దివ్యాంగులకు 4016 రూపాయలు ప్రతి నెల చెల్లిస్తుంది. మొత్తం 11 రకాల పింఛన్లకు సంబంధించి కల్లుగీత కార్మికులకు ఇచ్చే పింఛన్లు పింఛన్‌దారుడు మరణిస్తే వాటిని పునరుద్ధరించే కార్యక్రమం చేపట్టడం లేదు. రెండున్నర ఏళ్ల కాలంలో కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయని నేపథ్యంలో జూన్ రెండు నాటికి పూర్తి స్థాయిలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తారని ఆశగా ఉన్నారు.

**అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి : దండి సురేష్**



అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో 25వేల మంది వివిధ రకాల పింఛన్లకు దరఖాస్తు చేశారని ఆయన తెలిపారు. ఇంటింటి సర్వే పేరుతో అధికారులు పింఛన్‌దారుల గురించి విచారణ చేస్తున్నారని విచారణ పేరుతో పింఛన్ల తొలగింపు ప్రక్రియను చేపట్టరాదని కొందరు పింఛన్‌దారులు జీవనోపాది కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని వారిని కూడా పరిగణలోకి తీసుకోవాలని సురేష్ కోరారు. పింఛన్ల పెంపుదలపై ప్రభుత్వం తాత్సరం చేయడం తగదని జూన్ రెండు నాటికి ప్రభుత్వం ప్రకటించినట్లుగా అర్హులైన అందరికీ పింఛన్లు ఇవ్వాలని ఆయన కోరారు.

# రైతుల ముసుగులో చెరువులు లూటీ..!

(మొదటిపేజీ తరువాయి)

బేతుపల్లి, రేజర్ల, బుగ్గపాడు చెరువుల్లో పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి.

**బేతుపల్లిలో ఉద్రిక్తత...**

బేతుపల్లి చెరువులో మట్టి తోలకాలను గ్రామస్తులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. గ్రామస్తులు రోడ్డుకు అడ్డంగా నిలవడంతో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు బారులు తీరాయి. అనుభవం లేని డ్రైవర్లు, లైసెన్సులు లేకుండా, ఇన్సూరెన్స్ సైతం లేని వ్యవసాయ ట్రాక్టర్లతో కమర్షియల్ దందా నడు పుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెరుపు వేగంతో దూసుకెళ్తున్న ట్రాక్టర్లతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. దుమ్ము ధూళితో గ్రామాలు దుమ్ముకొట్టుకుపోతున్నాయి. అనుభవం డ్రైవర్ల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కి నోరు లేని మూగజీవాలు గాయాలపాలవుతుండగా, రహదారులు కళ కోల్పోతున్నాయి.



**ఆ ఒక్క శాఖ అనుమతి ఉంటే చాలా...?**

ఇరిగేషన్ అనుమతులు సరే, మరి రవాణా, మైనింగ్, పోలీస్ అనుమతుల మాటేమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. రైతుల పేరు చెప్పి చెరువులను లూటీ చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మట్టి తోలకాలను తక్షణమే నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళా హత్య కేసులో నిందితుడి అరెస్టు




**ప్రజాపక్షం/ మధిర మున్సిపాలిటీ :** మధిర మండలంలోని కృష్ణాపురంలో ఇటీవల జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నట్లు వైరా ఏసిపి సారంగ పాణి తెలిపారు. బుధవారం మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీన మధిర మండలం కృష్ణాపురం ఓ వెంచర్‌లో అనుమానస్పద స్థితిలో మహిళ హత్యకు గురి కాగా దీనిపై సమగ్ర విచారణ జరిపి నిందితున్ని అదుపులోకి తీసుకున్నట్లుతెలిపారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం మేడూరు గ్రామానికి చెందిన కల్పన మధిరలోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ ప్రతిరోజు మేడూరు నుండి మధిరకు విధులకు వెళ్లేదని, 15వ తేదీన విధులకు ఇంటి నుండి బయలు దేరి ఆమె ఆరోజు కార్యాలయానికి హాజరు కాలేదని సహోద్యగి ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం అందింది. అదే రోజు యార్లగడ్డ చెన్నారావు అనే వ్యక్తి మీ అక్క నా దగ్గర ఉండి మాట్లాడుకోవాలి అంటూ ఫోన్ సందేశం పంపినట్లు మృతురాలి తమ్ముడు ఫిర్యాదులో తెలిపినట్లు తెలిపారు. అనంతరం సెల్‌ఫోన్‌సిగ్నల్ ఆధారంగా గాలింపు చేపట్టగా, కృష్ణాపురం గ్రామశివారులోని నక్షత్ర వెంచర్ ప్రాంతంలో కల్పన మృతదేహం లభ్యమైందని, ఆమె మెడ, నోటి చుట్టూ చున్నీ బిగించి హత్య చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. బాధిత కుటుబం ఫిర్యాదులో భాగంగా సాక్షులను విచారించగా నిందితుడు యార్లగడ్డ అంకుశరావు అలియాస్ చెన్నారావు మృతురాలితో సన్నిహిత సంబంధం కొనసాగించినట్లు వెల్లడైందని తెలిపారు. వ్యక్తిగత సంబంధాల విషయంలో ఇద్దరి మధ్య తరచూ వివాదాలు జరగుతున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. నిందితుడి కోసం మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఈ నెల 20వ తేదీన అంబారుపేట వెంచర్ ప్రాంతంలో నిందితుడు ఉన్నట్లు గుర్తించి దాడి చేసి అదుపులోకి తీసుకుని అతని వద్ద మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం నిందితున్ని కోర్టు నందు హాజరుపర్చనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మధిర రూరల్ సిఐ డి.మధు, రూరల్ ఎస్సై బి.లక్ష్మీ భార్గవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బక్రీద్‌ను మతసామరస్యంతో జరుపుకోవాలి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** బక్రీద్ పండుగను శాంతియుతంగా, మతసామరస్యంతో జరుపుకోవాలని టౌన్ ఏసిపి ఎస్‌వి రమణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువుల అక్రమ రవాణా నియంత్రించేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలన్నారు. ఆవులు, దూడల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ఇరవై నాలుగు గంటలు నిఘా ఉంచామన్నారు. నిబంధనలకు లోబడి సరైన దృవ పత్రాలతో మాత్రమే పశువులను తరలించాలని సూచించారు. గోవధ నిషేధమన్నారు. కేవలం అనుమతించబడిన జంతువులను మాత్రమే బలి ఇవ్వాలన్నారు. అదేవిధంగా జంతువ్యర్థలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా మున్సిపాల్ అధికారుల సహకారంతో వాటిని తొలగించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే వార్తలు, వదంతులు వ్యాప్తి చేసేవారిపై కఠిర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వన్ టౌన్, టూటౌన్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, ఎస్సైలు పాల్గొన్నారు.

# మందుల దుకాణాలు బంద్

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా మంచి కంటే చెడు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఆన్‌లైన్ మందుల సరఫరా మాటున డ్రగ్స్ కూడా సరఫరా అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధాన పట్టణాల్లోనూ మెడికల్ షాపుల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఫార్మసీ రంగాన్ని ప్రభావితం చేస్తున్న పలు కీలక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అక్రమ ఫార్మసీలను నియంత్రించడంతో పాటు జిఎస్ఆర్ 2020 (ఈ) నిబంధనలు అమలు వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టిసారించాలని ప్రజల భద్రత, నాణ్యమైన ఔషధాల సరఫరా, ఫార్మసీ రంగ పరిరక్షణ తదితర అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని ఆందోళనకారులు కోరారు.

## సన్‌రెజ్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సన్‌రైజ్ సంస్థ ఆధ్వర్యంలో విఆర్‌పురం మండలం ఆదివాసి గ్రామంలో దుస్తులు పంపిణీ చేశారు. ఏనుగు కిరణ్‌బాబు దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా రూ. 50వేల విలువైన దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాలతిదాస్, కల్లూరు ఎంపివో ఏనుగు సురేష్‌బాబు, సంస్థ ప్రతినిధులు ఏనుగు కిరణ్‌బాబు, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలకు పార్థివదేహం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం మమత మెడికల్ కళాశాలకు పార్ధివ దేహాన్ని బుధవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయునిగా ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని గంధంపల్లి, సీతంపేట, ముల్కనూరు, జల్లేపల్లి, వెంకటాపురం తదితర గ్రామాల్లో పనిచేసిన కోసరాజు రామకృష్ణయ్య (88) మంగళవారం మరణించగా బుధవారం ఆయన పార్ధివ దేహాన్ని కళాశాలకు అందజేశారు. జిల్లా విద్య ఉప పర్యవేక్షణ అధికారిగా పదోన్నతిపై పనిచేసిన రామకృష్ణయ్య తాను ప్రభుత్వ ఉపాధ్యాయునిగా బాధ్యతలు స్వీకరించిన తొలి దశలోనే అంటే సుమారు 40 ఏళ్ల క్రితమే తన పార్ధివ దేహాన్ని విద్యార్థుల పరీక్షల నిమిత్తం వైద్య కళాశాలకు అందించాలని నిర్ణయించుకున్నారు. అప్పట్లో కాకతీయ మెడికల్ కళాశాల ఉండడంతో దానికి అందజేయాలని భావించారు. ఖమ్మంలో మమత మెడికల్ కళాశాల ఏర్పాటైన తర్వాత ఎనిమిదేళ్ల క్రితం తన పార్ధివ దేహాన్ని మమత మెడికల్ కళాశాలకు అందించాలని రామకృష్ణయ్య నోటరీ చేయించారు. ఆయన కోరికకు అనుగుణంగా కుటుంబ సభ్యులు బుధవారం పార్ధివ దేహాన్ని అందజేశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

## ఎంపిడివో కార్యాలయం ఎదుట ఆందోళన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** తెలంగాణ రాష్ట్ర వివోఏల సమస్యల పరిష్కారం కోసం జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు బుధవారం రఘునాథపాలెం మండల కార్యాలయం ఎదుట వివోఏలు ఆందోళన నిర్వహించారు. వివోఏల కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వ పాలసీని వర్తింపజేయాలని, అర్హులైన వివోఏలకు సిసిలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. వివోఏలకు ఆరోగ్య బీమ పథకాన్ని వర్తింపజేయాలని, 58వ జీవోను సవరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగమణి, సరస్వతి, లలిత, సంపూర్ణ, అంజలి, రేణుక, ఉమా, శైలజ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌ని వైరా నియోజకవర్గ శాసనభ్యులు రాందాస్‌నాయక్ కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అందించారు. వైరా నియోజకవర్గంలో, వైరా మున్సిపాలిటీ పరిధిలోని పలు అంశాలను కలెక్టర్‌తో చర్చించారు. శాసనసభ్యులు రాందాస్‌నాయక్ సూచనలకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, స్నానాల లక్ష్మీపురం ఉప సర్పంచ్ మల్లు రామకృష్ణ, మూడు సురేష్, చీమలపాడు సర్పంచ్ బాబుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు అభివృద్ధికి తోడ్పడాలి




**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం పాలడుగు హైస్కూల్‌లో దివ్యాంగులకు ఎస్ఆర్‌డిఎస ఎనేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వ్యాపార నైపుణ్య శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ప్రధానోత్సవం చేయడం జరిగింది. ఈకార్యక్రమానికి ఎస్ఆర్‌డిఎస్ డైరెక్టర్ గడ్డం రాంబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ వైరా మండలంలో దివ్యాంగులకు శిక్షణ ఇచ్చి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం కోస్ర కృషి చేసిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌బిఐ ఆర్‌ఎస్ఈటిఐ డైరెక్టర్ చంద్రశేఖర్ హాజరై మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలంలో పది రోజులు దివ్యాంగులకు వ్యాపార నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడం జరిగింది. తదనంతరం వీరందరికి రుణాల కొరకు వారి యొక్క అప్లికేషన్లు బ్యాంకులకు సిఫారస్ చేయడం జరుగుతుంది. వారి యొక్క అర్హతలను బట్టి అవకాశం ఉన్నవారిఇ రుణాలు కూడా లభిస్తాయని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న దివ్యాంగులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక అతిధి పాలడుగు గ్రామ సర్పంచ్ నర్సింహారావు పాల్గొని మాట్లాడుతూ గ్రామంలోని దివ్యాంగులందరూ ఆర్థికంగా బలోపేతం అవ్వాలని అందుకు మా యొక్క సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. నేను ప్రత్యేకంగా దివ్యాంగులకు వారి సమస్యలు పరిష్కారానికి ప్రధమ స్తానాన్ని ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ ఆర్‌సిటి ఫ్యాకల్టీ షేక్ హైద్బాపాషా, ఎస్ఆర్‌డిఎస్ ప్రతినిధి ప్రతాప్, ఎనేబుల్ కమిటీ ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

# మధిరలో మెడికల్ షాపులు బంద్ సంపూర్ణం

**ప్రజాపక్షం/ మధిర :** ఆలిండియా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఆధ్వర్యంలో బుధవారం దేశ వ్యాప్తంగా నిర్వహించిన బంద్‌కు మధిరలో విశేష స్పందన లభించింది. పట్టణంలోని మెడికల్ షాపులన్ని స్వచ్ఛందంగా మూసి వేసి ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బి.గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, కోశాధికారి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫార్మసీ రంగాన్ని ప్రభావితం చేస్తున్న పలు కీలక సమస్యల పరిష్కారం కోసం ఈ బంద్ చేపట్టినట్లు తెలిపారు. అక్రమ ఈ ఫార్మసీల నియంత్రణ, మందులపై భారీ డిస్కౌంట్ల నియంత్రణ, జీఎస్ఆర్ 220(ఈ) నిబంధనల అమలు వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఆన్‌లైన్ ద్వారా అక్రమంగా మందుల విక్రయాలు పెరగడం చిన్న, మధ్య తరహా మెడికల్ దుకాణాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోగుల భద్రత, నాణ్యమైన ఔషధాల సరఫరా, ఫార్మసీ రంగ పరిరక్షణ కోసమే ఈ బంద్ నిర్వహించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు దొడ్డ మురళీ, వై.రాము, వెచ్చ శ్రీను, వి.అనంతరామయ్య, కె.వంశీ, జి.రామశ్రీను, వెంకట్, సాగర్ శ్రీను, మెడికల్ షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.




# సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/చింతకాని :** రాష్ట్ర ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ.10,43,500/ ల విలువ గల ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను చింతకాని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కన్నెబోయిన గోపి అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుందిని అన్నారు.తమకు చెక్కులు మంజూరీకి కృషిచేసిన ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మడుపల్లి బాస్కర్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొప్పుల గోవిందరావు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరక్టర్ బందెల నాగార్జున. మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, మాజీ ఎంపీటీసీ బొర్రా ప్రసాద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణ, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# గోరీలపాడు తండాలో హత్యాయత్నం

-కుటుంబ కలహాల నేపథ్యంలో ఘటన
-తీవ్ర గాయాలతో భర్త ఆసుపత్రిలో చికిత్స
-భార్య, ఆమెకు సన్నిహితుడిగా భావిస్తున్న వ్యక్తి పరారీ
-కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**ప్రజాపక్షం/కూసుమంచి:** ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గోరీలపాడు తండాలో జరిగిన హత్యాయత్నం ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన బానోత్ వీరన్న(45)పై గుర్తు తెలియని పరిస్థితుల్లో కత్తితో దాడి జరగడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం వీరన్నకు మునిగేపల్లి గ్రామానికి చెందిన రాంబాయితో గత కొంతకాలంగా పరిచయం ఉంది. రాంబాబు తరచూ వీరన్న ఇంటికి వచ్చి వెళ్లేవాడని, ఈ క్రమంలో అతనికి వీరన్న భార్య రుక్కమ్మతో సాన్నిహిత్యం పెరిగిందనే అనుమానాలతో కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈనెల 19వ తేదీ రాత్రి కూడా ఇదే విషయంపై ఇంట్లో తీవ్ర వాగ్వాదం జరిగినట్లు సమాచారం. అనంతరం అర్ధరాత్రి సమయంలో వీరన్నపై కత్తితో దాడి జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఘటన తర్వాత రక్తపు మడుగులో పడి ఉన్న వీరన్నను కుటుంబ సభ్యులు ఉదయం గమనించి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై బానోత్ వాసు నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూసుమంచి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఘటన అనంతరం రుక్కమ్మ, రాంబాబు ఇద్దరూ కనిపించకుండా పోవడంతో వారిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వారి కోసం ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. గ్రామంలో ఈ ఘటన చర్చనీయాంశంగా మారగా కుటుంబ విభేదాలు తీవ్ర రూపం దాల్చి హత్యాయత్నానికి దారితీసినట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు గ్రామంలో పరిస్థితిని పరిశీలిస్తూ ఆధారాలు సేకరిస్తున్నారు.

# జాతీయస్థాయిలో షూటింగ్ బాల్‌కు ఎంపికైన శ్రీనిధి విద్యార్థులు

**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్ర స్థాయిలో జరిగిన షూటింగ్ బాల్ పోటీలలో ఖమ్మం జిల్లా జట్టు తరుపున పాల్గొన్న శ్రీనిధి స్కూల్ విద్యార్థులు వేమిరెడ్డి కార్తీక్‌రెడ్డి, టి.అభిషేక్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 29, 30, 31తేదీల్లో గుంటూరులో జరిగే జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈసందర్భంగా పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బి.అంజన్‌బాబు, డైరెక్టర్ సిహెచ్.చందు, వైస్‌ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. జాతీయస్థాయిలో కూడా వారు ప్రతిభ చాటి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




# మత్స్యకారులకు మూడు రోజుల శిక్షణ ముగింపు

**ప్రజాపక్షం/కూసుమంచి:** పాలేరు మత్స్య పరిశోధన స్థానం ఆధ్వర్యంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులకు నిర్వహించిన జలాశయాలలో చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులు అంశంపై మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ముగిసింది. కార్యక్రమాన్ని పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వ విద్యాలయం, తెలంగాణ మత్స్యశాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగా నిర్వహించాయి. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి 25 మంది మత్స్యకారులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి పి శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సబ్సిడీలు, బ్యాంకు రుణాలను వినియోగించుకుని ఆక్వారంగంలో అభివృద్ధి సాధించాలని సూచించారు. డాక్టర్ ఎం శ్యాం ప్రసాద్ ఆధునిక చేపల పెంపక పద్ధతులపై అవగాహన కల్పించగా, పి శాంతన్న దడి, పంజరపు చేపల పెంపకంపై వివరించారు. సిగ నాగరాజు చేపల వ్యాధులు, నివారణ చర్యలను తెలియజేయగా, బానోత్ దివ్య నాస్ఫాడ్ రిపోర్ట్ ఫిష్ డిసీజ్ యాప్ ఉపయోగాలను వివరించారు. చివరగా పాల్గొన్న మత్స్యకారులకు ప్రశంస పత్రాలు అందజేశారు.




# మెడికల్ షాపుల బంద్ విజయవంతం

**ఆన్‌లైన్ ఫార్మసీలను నియంత్రించాలని డిమాండ్**

**నల్లబ్యాడ్జీలతో నిరసన**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** దేశవ్యాప్తంగా కెమిస్టులు, డ్రగ్గిస్టుల సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపు మేరకు బుధవారం పట్టణంలో మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మెడికల్ షాపుల బందు విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ ఆన్‌లైన్ ఫార్మసీలు నియంత్రణ లేకుండా మందులు అమ్ముతున్నాయని, ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలపై కఠిన నియంత్రణ, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలను ఆపడం, భారీ డిస్కౌంట్ల వల్ల చిన్న మెడికల్ షాపులకు నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. షాపులు బంద్ చేసిన యజమానులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గుడిపూడి గాంధీ, కూసంపూడి మురళి, రహమత్ పాషా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# సరస్వతి (అంతర్వాహిని) నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు



**ప్రజాపక్షం/మణుగూరు:** కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాల సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ మణుగూరు డిపో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ప్రతి రోజు ఉదయం 6:30 గంటలకు మణుగూరు నుంచి, తిరిగి సాయంత్రం 4 గంటలకు కాళేశ్వరం నుంచి బస్సులు నడుస్తాయని డిపో మేనేజర్ కె. శ్యాంసుందర్ తెలిపారు. మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# మెడికల్ షాపులు బంద్ విజయవంతం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** దేశ వ్యాప్తంగా చేపట్టిన మెడికల్ షాపులు బంద్ విజయవంతం అయ్యాయి. మెడికల్ షాపు అసోసియేషన్ ప్రతినిధులు పసుపులేటి ఉపేందర్ మాట్లాడారు. కార్పొరేట్ సంస్థల దోపిడి ధరల విధానం ను స్థిరపడిన ఔషద పంపిణీ వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మసీ రక్షణ కోసం, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఫార్మసీ అక్రమ కార్యకలపాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పెద్ద కంపెనీల అన్యాయ ధరల విధానం నిలిపివేయాలని కోరారు. చిన్న తరహా, మరియు పెద్ద తరహా కెమిస్ట్ల మనగడుకు కాకుండా ప్రజారోగ్యం పై కూడ తీవ్ర ప్రమాదాల ను కలిగిస్తున్నాయని అన్నారు. పలు డిమాండ్ల తసాధన కోసం మెడికల్ షాపు యాజమానులు దుకాణాల బంద్ ను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాపులు ప్రతినిధులు పి.వెంకటేశ్వరరావు. సురేష్, జగదీష్, ఫరీద్బాబా, ఉదయ్, సాయిబాబా, వి.నారాయణ రావు, రాంప్రసాద్, కైలాసపు గోపి తదితరులు పాల్గొన్నారు.




# దమ్మపేట ఎస్ఐగా రాజ్‌కుమార్

**ప్రజాపక్షం/ దమ్మపేట :** దమ్మపేట నూతన ఎస్ఐగా రాజ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ విధులు నిర్వహించిన సాయి కిషోర్‌రెడ్డి కొత్తగూడెం విఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తామన్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, ప్రజలు పోలీసులకు సహకరించాలని రాజ్‌కుమార్ కోరారు.

# మెడికల్ షాపుల బంద్ విజయవంతం

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఆన్‌లైన్ ఫార్మసీల ద్వారా జరుగుతున్న మందులు విక్రయాలకు వ్యతిరేకంగా ఫార్మసీ సంఘాల పిలుపులో భాగంగా చేపట్టిన మెడికల్ షాపుల బంద్ బుధవారం పాల్వంచలో ప్రశాంతంగా జరిగింది. . సందర్భంగా పాల్వంచ యూనిట్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిరసిస్తూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాల్వంచ వ్యాప్తంగా ఉన్నటువంటి 50 షాపులు మూతపడ్డాయి. దీనితో మందులు కొనుగోలు దారులు తీవ్ర ఇబ్బందుకు ఎదుర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మేదరమెట్ల శ్రీనివాసరావు, ట్రెజరర్ భానుమూర్తి, స్వరూప, రవికుమార్, కేశవ తదితరులు పాల్గొన్నారు.



## కెమిస్టుల బంద్ విజయవంతం

### -ఆన్‌లైన్ మందుల విక్రయాలు నిలిపివేయాలని డిమాండ్



ప్రజాపక్షం/ములకలపల్లి: ఆల్ ఇండియా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు పాల్వంచ యూనిట్ ఆధ్వర్యంలో ములకలపల్లి మండల కెమిస్టులు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించి విజయవంతం చేశారు. ఈసందర్భంగా ములకలపల్లిలో శాంతియుత ర్యాలీ చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ మందుల విక్రయాలను నిలిపివేయాలని, కార్పొరేట్ కంపెనీల ఆధిపత్యాన్ని అరికట్టాలని, నకిలీ మందులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోవిడ్ 19 సమయంలో ఇచ్చిన తాత్కాలిక జీవోలను రద్దు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పద్దం బుజ్జి, వేణు, విశ్వాస్, నాగరాజు, ఎస్‌కే రఫీ, చెన్నారావు, మహేష్, అందే రమేష్, జుకైద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు, పెట్రోలు, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి



ప్రజాపక్షం/కూసుమంచి: కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువులు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని న్యూడెమోక్రసీ పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పెంపు వల్ల ఈ దేశంలో ఉన్నటువంటి కార్మికులు, కర్షకులు ప్రజలపై కోట్లాది రూపాయలు భారం పడి దివాలా తీసే పరిస్థితి వస్తుందన్నారు. కేంద్రం గత 12 సంవత్సరాలలో కార్పొరేట్ల అనుకూల విధానాలు అవలంబిస్తూ ప్రజల్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. భారతదేశ మిత్ర దేశమైన ఇరాన్‌పై ఇజ్రాయిల్ అమెరికా వేస్తున్న అప్రజాస్వామిక దాడిని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశ అధినేత మోడీ ఖండించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుగు కండిషన్లు లేకుండా మొక్కజొన్న వరిని కొనుగోలు చేయాలన్నారు. ఒక పక్క వర్షాలకు రైతులు టెన్షన్‌కి గురై మధ్య దళారీలకు సగం రేట్‌కి అమ్ముతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కూసుమంచి సబ్ డివిజన్ కార్యదర్శి ఐ వెంకన్న, కే సురేష్, చెరుకుపల్లి వీరయ్య, బుర్ర సైదులు, బత్తల ఉప్పలయ్య, నిమ్మల వెంకన్న, దాట్ల వీరస్వామి, పోకల వెంకన్న, ఆర్ సంజీవరావు, పిఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు కే కల్పన, తదితరులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు.. అన్నదాతలకు అవగాహన కార్యక్రమం




ప్రజాపక్షం/ములకలపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ములకలపల్లి మండలం సూరంపాలెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి భరత్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలను, ముఖ్యంగా ప్రొఫెసర జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం విడుదల చేసిన రకాలను సాగు చేయాలని సూచించారు. అధిక ఎరువుల వినియోగం వల్ల భూసారం తగ్గిపోతుందని, రైతులు సమతుల్య ఎరువుల వినియోగంపై దృష్టి పెట్టాలని తెలిపారు. పురుగు మందుల అధిక వినియోగానికి బదులుగా వేప నూనె పిచికారీ, జిగురు అట్టల వినియోగం చేపట్టాలని సూచించారు. ప్రతి రైతు ఇంటి వద్దనే ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్లో కూరగాయల సాగు చేపట్టాలని కోరారు. అనంతరం ఉద్యాన శాస్త్రవేత్త బి శివ, మండల వ్యవసాయ అధికారి అరుణ్ బాబు మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి నేల సారాన్ని పెంపొందించాలని, ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్స్ రిజిస్ట్రీ చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్‌తో పాటు సుమారు 35 మంది రైతులు పాల్గొన్నారు.

## ఏన్కూరు పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/ఏన్కూరు: ఏన్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కల్లూరు డివిజన్ ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రదీప్ బాబు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్, ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్, హైరిస్క్ గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ డెంగ్యూ కేసుల వివరాలను పరిశీలించారు. అనంతరం తూతకలింగన్నపేట ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ బాలకృష్ణ, సూపర్వైజర్ గోపాల్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# స్మార్ట్ ఫోన్‌తో తస్మాత్ జాగ్రత్త..!

**-విచ్చలవిడిగా స్మార్ట్ ఫోన్‌లు వాడుతున్న చిన్నారులు**
**-స్మార్ట్ ఫోన్ వాడకంతో ఒళ్ళు నొప్పులు, కంటి సమస్యలు**
**-చదువులకు దూరం అవుతున్న చిన్నారులు**







ప్రజాపక్షం/కరకగూడెం: ఆధునికతపెరిగిపోయిన నేపథ్యంలో ప్రతి పని ఫోన్ లేనిదే కావడం లేదు. సమాచారాన్ని చేర వేసే సాధనంగా చేరువైన ఫోన్ ప్రస్తుతం మనిషి నిత్యావసర పనుల్లో ఒకటిగా మారి పోయింది. ప్రతి ఒక్కరూ అవసరం ఉన్నా.. లేకపోయినా.. గంటల తరబడి స్మార్ట్ ఫోన్ వాడుతున్నారు. స్మార్ట్ ఫోన్ ఉపయోగించే క్రమంలో సరిగా కూర్చున్నామా.. సరైనపద్ధతులు పాటిస్తున్నామా.. అన్న విష యాలు పట్టించుకోవడం లేదు. అయితే టర్కీలోని ఇస్తాంబుల్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు స్మార్ట్ ఫోన్ వాడకంపై తస్మాత్ జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరిస్తున్నారు. ఎలా కూర్చున్నామనే స్పృహ కూడా లేకుండా ఫోన్ లో మునిగిపోయే వారిలో దాదాపు 70 శాతం మంది వీపుపై భాగంలో నొప్పితో బాధపడుతున్నామని యువత, పిల్లలు తెలిపారన్నారు. ఒక రోజులో ఆరు గంటలకు మించి ఫోన్ ను వాడే 80 శాతం మందికి మెడ నొప్పి, 70 శాతం వారికి భుజాల నొప్పి వస్తున్నట్లు పేర్కొన్నారు. మణికట్టు, చేతుల నొప్పులకు కూడా ఫోన్ విచ్చలవిడి వాడకం కారణం అవుతుంద న్నారు. ఇదిలా ఉంటే పిల్లలు స్మార్ట్ ఫోన్ లకు బానిసలవుతూ, చదువుకు దూరమవు తున్నారు. పనికి రాని గేమ్స్ అంటూ, వీడియోలు చూస్తూ ఆరోగ్యాన్ని పాడు చేసు కుంటున్నారు. వీలైనంత వరకు పిల్లలకు స్మార్ట్ ఫోన్ కు దూరంగా ఉంచాలని, ఇతర ఆటలు ఆడే విధంగా అవగాహన కల్పించి వైద్యులు, నిపుణులు సూచిస్తున్నారు.

**తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి...**

పిల్లలకు చదువుకు దూరం అవుతూ ఫోన్లలో గేమ్స్ అని ఇన్స్టాగ్రాములు, ఫేస్ బుక్ లోని యాప్ లతో ఫోన్‌లో బిజీగా ఉంటున్నారు. స్మార్ట్ ఫోన్‌ల మాయలో పడి తల్లిదండ్రుల మాట వినడం లేదు. సాధ్యమైనంత వరకూ ఫోన్లకు దూరం ఉండటమే మంచిదని వైద్యులు తెలుపుతున్నారు.

# సాంకేతిక రంగాల్లో గణితశాస్త్రం కీలకం



ప్రజాపక్షం/పాల్వంచ : సాంకేతిక రంగాలలో గణిత శాస్త్రం కీలక పాత్ర పోషిస్తుందని వక్తలు అన్నారు. కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అప్లికేషన్ ఆఫ్ మాథమెటిక్స్ ఇన్ మోడ్రన్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై ఒకరోజు అంతర్జాల గణిత జాతీయ సదస్సు బుదవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆధునిక విజ్ఞాన శాస్త్రం మరియు సాంకేతిక రంగాలలో గణితశాస్త్రం ప్రాముఖ్యతను అవగాహన చేసుకోవటం, గణిత అనువర్తనాల ద్వారా పరిశోధన, ఆవిష్కరణలు, సమాజాభివృద్ధికి కొత్త మార్గాలను అన్వేషించడం కోసం సదస్సు ఉద్దేశ్యమన్నారు.విద్యార్థులు, అద్యాపకులు, పరిశోధకుల్లో గణితశాస్త్రంపై ఆసక్తిని పెంపొందించి ఆధునిక సమస్యలకు గణిత ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ప్రేరణ కలిగిస్తుందని తెలిపారు. వివిధ కళాశాలలకు చెందిన 92 మంది తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ సదస్సుకు అధ్యక్షురాలిగా పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రన్సిపాల్ పోలారపు పద్మ, కన్వీనర్‌గా వ్యవహరించారు. గణితశాస్త్ర విభాగాధిపతి పి. అనురాధలు, వక్తులుగా ఆచార్య నాగార్జున యూనివర్సిటి అసోసియేట్ ప్రొఫెసర్ జ్ఞానేశ్వర్‌రెడ్డి, విజయవాడకు చెందిన ఎస్.ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ జి. లలితలు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. వివిధ కళాశాలలకు చెందిన 92 మంది తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి. ఝాన్సీరాణి, రామచంద్రా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం. పూర్ణచందర్, అసోసియేట్ ప్రొఫెసర్ కే. వనజ, దేశంలోని పలు కళాశాలల అద్యాపకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు

**-ఫ్లెక్సీ చింపివేతతో కాంగ్రెస్ కార్యాలయంలో ఉద్రిక్తత**





ప్రజాపక్షం/చండ్రుగొండ: మండల కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఫ్లెక్సీ ఏర్పాటు వివాదం ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. నూతనంగా ఎన్నికైన మండల కాంగ్రెస్ అధ్యక్షులు నల్లమోతు వెంకటరమణ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో గ్రామ శాఖ అధ్యక్షుడు తుమ్మలపల్లి సురేష్ ఫోటో లేకపోవడంతో ఆగ్రహించిన ఆయన వర్గీయులు ఫ్లెక్సీ చింపివేయడంతో వివాదం మొదలైంది. అనంతరం ఇరు వర్గాల నాయకులు, కార్యకర్తల మధ్య మాటామాటా పెరిగి తోపులాటకు దారి తీసింది. మాజీ జెడ్‌పిటిసి వర్గీయులు గ్రామ శాఖ అధ్యక్షుడు వర్గాన్ని కార్యాలయం నుంచి బయటకు పంపినట్లు సమాచారం. కాంగ్రెస్ కార్యాలయం వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, సమాచారం అందుకున్న స్థానిక నాయకులు, పెద్దలు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను శాంతింపజేశారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ మండల పరిధిలో ఉండగానే పార్టీ కార్యాలయంలో వర్గపోరు బయటపడటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### ఎస్‌ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియకు

# రాజకీయ పార్టీల సహకారం అవసరం

**బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలు వెంటనే సమర్పించాలి : కలెక్టర్ అంకిత్**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే సమర్పించాలని సూచించారు. బీఎల్ఓలు నిర్వహించే ఇంటింటి సర్వే కార్యక్రమానికి రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. జూన్ 2026 నుండి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని, ప్రతి ఓటరు ఇంటిని కనీసం ఒక్కసారైనా సందర్శించి అవసరమైతే మూడు సార్లు వరకు వెళ్లి ఫారాలు సేకరిస్తారని చెప్పారు. ఎన్యూమరేషల్ ఫారాల సేకరణ ప్రక్రియ జూన్ 26 నుండి ప్రారంభమై 24072026 లోపు పూర్తవుతుందని తెలిపారు. అనంతరం 31072026న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించి, 31072026 నుండి 30082026 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పారు. 01102026న తుది ఓటరు జాబితా ప్రచురణ ఉంటుందని తెలిపారు. చిరునామా మార్పులు, ఇతర సవరణల కోసం ఫారం8 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఓటర్లు తమ పేరు ఎస్ఐఆర్2002 జాబితాలో ఉందో లేదో తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ లేదా ఈసీఐ ఓటర్స్ పోర్టల్‌లో ''సెర్చ్ బై ఎలెక్టర్ డిటైల్స్'' ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఆధార్ నెంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికమని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వారు ఫారం6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, 01 అక్టోబర్ 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే వారికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఫారం నింపడంలో లేదా వివరాల ధృవీకరణలో సహాయం కోసం బీఎల్‌వోలు, 1950 హెల్ప్‌లైన్, ఈసీఐ ఓటర్స్ పోర్టల్ మరియు ''బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌వో'' సౌకర్యాలను వినియోగించుకోవచ్చని సూచించారు. విదేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగం చేస్తున్న ఓటర్ల తరపున కుటుంబంలోని పెద్ద సభ్యుడు ఫారం నింపి బీఎల్‌వోకు సమర్పించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యత, ఫారాలు నింపే విధానంపై రాజకీయ పార్టీ ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి రాంబాబు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి దేవి ప్రసన్న, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధి కంచర్ల జమలయ్య, ఎన్నికల సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

## మూడు రోజుల్లో రెండవసారి పెట్రోల్ డీజిల్ రేట్లు పెంచడం దారుణం

**- తక్షణమే తగ్గించకుంటే కేంద్ర ప్రభుత్వం పతనం తప్పదు**
**- తెలంగాణ రాష్ట్ర ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య**




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: పెట్రోల్ డీజిల్ ధరలు ఒకవైపు తగ్గించాలని ప్రజలు ఆందోళన చేస్తుండగా మళ్లీ ధరలు పెంచడం దారుణమని ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెట్రోల్, డీజిల్ చార్జీలను మూడు రోజుల క్రితమే మూడు రూపాయలు పెంచిన బిజెపి ప్రభుత్వం మరలా పెట్రోల్, డీజిల్ పై 90 పైసలు పెంచడం దారుణమని అన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యవసర వస్తువు ధరలతో ఇబ్బందులు పడుతు సామాన్యులు తాజాగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుదలతో పేద మధ్యతరగతి ప్రజలపై మరింత భారం పెరిగిందని అన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెరగటం వలన ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒకవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్ల ఆదాయంపై గండి కొట్టి వారి కుటుంబాలను పస్తు లు ఉండే విధంగా పథకం అమలు చేస్తుందని అన్నారు. అనేక సార్లు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి దున్నపోతు మీద వర్షం చందంగా వ్యవహరిస్తుంది, గడిచిన 12 ఏళ్లుగా అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులు కనుసైగల్లో పాలకులు ముందుకు సాగుతున్నారని విమర్శించారు. ప్రజాసంక్షేమం విస్మరించ మోటా ర్ కారిమకుల సంక్షేమాన్ని తుంగలోకి తొక్కి ఆదాయమే లక్ష్యంగా డీజిల్, పెట్రోల్ రేట్లు పెంచుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను మోటార్ కార్మికుడు ఖండించాలని పిలుపునిచ్చారు.

## జేఏసి నుండి వైదొలిగిన శ్రమ శక్తి యూనియన్

ప్రజాపక్షం/బూర్గంపాడు: ఐటిసి పిఎస్‌పిడి సారపాక యూనిట్‌లో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నుండి శ్రమ శక్తి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బిఆర్‌టియూ స్వచ్ఛందంగా వైదొలుగుతున్నట్లు ఆ సంఘం నాయకులు ప్రకటించారు. 14వ వేతన ఒప్పంద పోరాటంలో జేఏసీతో కలిసి గేట్ మీటింగ్లు, నిరసనలు, ఉద్యమాల్లో పాల్గొని కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధనకు కృషి చేసినట్లు తెలిపారు. ఈ పోరాట ఫలితంగా కార్మికులకు అనేక ప్రయోజనాలు దక్కాయని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో జేఏసీ నుంచి తప్పుకుంటున్నప్పటికీ, 14వ వేతన ఒప్పందంలోని అన్ని అంశాలు పూర్తిగా అమ లు అయ్యే వరకు కాంట్రాక్ట్ కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మేరకు శ్రమ శక్తి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బిఆర్‌టియూ అధ్యక్షులు కందూరు పెద్దిరెడ్డి, జనరల్ సెక్రటరీ సింగరపు సతీష్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

## కారేపల్లిలో మెడికల్ షాప్‌ల బంద్ విజయవంతం



ప్రజాపక్షం/కారేపల్లి : మండల కేంద్రమైన కారేపల్లిలో అఖిలభారత కెమిస్ట్ అండ్ డ్రగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 20న బుధవారం నిర్వహించ తలపెట్టిన పిలుపులో భాగంగా సింగరేణి మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులందరితో కలిసి కారేపల్లిలోని సినిమా హాల్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలను నిషేధించాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కెమిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి రంగనాథ్, అసోసియేషన్ నాయకులు అనంతారపు వెంకటాచారి, గండమాల వెంకటేశ్వర్లు, బుడిగె శ్రీనివాసరావు, బాలిన వెంకటరెడ్డి, పోతురాజు రమేష్, ఎండి ఇస్మాయిల్‌లు మాట్లాడుతూ దేశంలో కరోనా అనంతరం ఎలాంటి అనుమతులు లేకుండా ఆన్‌లైన్‌లో మనుషుల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపే మందుల అమ్మకాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రజా ఆరోగ్యాన్ని కాపాడడంలో ముఖ్యంగా యువత చెడు వ్యవసనాలకు బానిస అయ్యే డ్రగ్స్‌తో పాటు మత్తు కలిగించే ఔషధ విక్రయాలను ఆన్లైన్‌లో అమ్మకాలను నిలిపివేయాలన్నారు. ప్రజా ఉపయోగ కోసం పని చేసే అన్ని రకాల ఔషధాలను క్వాలిఫైడ్ డాక్టర్ల ప్రిస్క్రిప్షన్‌తో రిజిస్టర్డ్ మెడికల్ షాపులలోనే విక్రయించే విధంగా ప్రభుత్వాలు చొరవ చూపి సహకరించాలన్నారు. ఈ మెడికల్ షాపుల బంద్ కార్యక్రమానికి సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఓరుగంటి నాగేశ్వరరావు, సామినేని బ్రహ్మం, సూర్యదేవర వెంకటేశ్వరరావు, పోలగాని శ్రీనివాసరావు, ఆమంచి బుచ్చి బాబు, వినోద్, తాతా కోటేశ్వరరావు, భూక్య పృధ్వీ కుమార్, అజ్మీర నరేష్, జాటోత్ అశోక్, చిలక సత్యం, కొల్లి శివాజీ, అజ్మీర భగత్‌సింగ్, స్వప్న, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ షాపులు బంద్ విజయవంతం



ప్రజాపక్షం/ఏన్కూరు : దేశ వ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్ కార్యక్రమం బుధవారం విజయవంతం అయింది. ఈసందర్భంగా మెడికల్ అసోసియేషన్ మండల అధ్యక్షులు గుడ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో మందులు అమ్మకాలు రద్దు చేయాలని కోరారు. మండలంలో మొత్తం 22 మెడికల్ షాపులు ఉన్నాయని అందరూ స్వచ్ఛందంగా తమ షాపులను బంద్ చేసి బంద్ కార్యక్రమంలో అందరూ పాల్గొన్నారని తెలిపారు. ఆన్‌లైన్ అమ్మకాల వల్ల ప్రజలకు లాభాలు కంటే నష్టాలు ఎక్కువగా ఉన్నాయని, తక్షణమే దాన్ని అరికట్టాలని కోరారు. ప్రజలకు నాణ్యమైన క్వాలిటీ మందులను అందించే దాని కోసం కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని అన్నారు. నకిలీ మందులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అధిక ఎమ్మార్పీలను కట్టడి చేయాలని అన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటానికి న్యాయమైన వ్యాపార విధానాలను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పాలెపు పాపారావు, షేక్ హుస్సేన్ ఉద్దీన్, షేక్ పెంటు సాహెబ్, వంశీకృష్ణ, దొడ్డ శ్రీనివాసరావు, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

## సుందరయ్య వర్ధంతి సందర్భంగా ప్రజానాట్య మండలి ఆటపాట



ప్రజాపక్షం/కారేపల్లి: పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కారేపల్లి మండలం పాటిమీదగుంపులో ఆట పాట కార్యక్రమం నిర్వహించారు. ప్రజా చైతన్య గీతాలు, కోలాటం, డప్పుదళం ప్రదర్శనలు నిర్వహించి సుందరయ్యకు నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకుడు ఏ జగన్ జెండా ఆవిష్కరించగా, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేశారు. కే నరేంద్ర అధ్యక్షతన జరిగిన సభలో నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సంస్కృతిని కాపాడాలని, కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మాచర్ల భారతి, భూక్య వీరభద్రం, మెరుగు రమణ, కొండబోయిన నాగేశ్వరరావు, వేముల సదానంద్, కొండలరావు, కొండబోయిన ఉమామతి, కరకపల్లి రాయమల్లు, సూరబాక ధనమ్మ, సూరబాక సర్వయ్య, ధరావత్ వినోద్ కుమార్, కరపటి రాంబాయమ్మ, బచ్చల బుజ్జమ్మ, బచ్చల వెంకటేశ్వర్లు, ధరావత్ రవికుమార్, ధరావత్ సరిత, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేయాలి



ప్రజాపక్షం/కారేపల్లి: రాష్ట్రంలో రైతులు పండించిన మొక్కజొన్న, వరి ధాన్యాన్ని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసి గోదాములకు తరలించాలని ఏఐకేఎంఎస్ అఖిల భారత రైతు కూలీ సంఘం ఖమ్మం జిల్లా నాయకుడు భూక్య శివా నాయక్ డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారని, మార్కెట్లలో దళారీలనను కట్టడి చేసి ప్రతి గింజకు మద్దతు ధర చెల్లించాలని కోరారు. గోదాములు, లారీలు లేక రైతులు ఇబ్బందులు పడుతుండగా, ప్రభుత్వం ఆలస్యం చేయడంతో వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువులు, విత్తనాల ధరల పెరుగుదలతో రైతులపై భారం పెరిగిందని తెలిపారు. ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 15 నుంచి 20 రోజుల్లోనే చెల్లింపులు చేయాలని, యాప్ నమోదుపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.

## పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్‌పి



ప్రజాపక్షం/పాల్వంచ : బాదితులకు న్యాయం జరిగేందుకు కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కొత్తగూడెం ఎస్‌పి బిరుదురాజు రోహిత్‌రాజు అన్నారు. పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సంధర్భంగా స్టేషన్ రికార్డులను, కేసుల వివరాలను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు అందజేశారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. న్యాయం కోసం వచ్చే బాదితులకు చట్ట పరంగా న్యాయం జరిగే విధంగా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐ. సతీష్, ఎస్సైలు టి. నాగరాజు, జి. విజయ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి బలం

**-కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం**
**-బిఆర్ఎస్ నేతలు పువ్వాడ, వద్దిరాజు, నామ తదితరులు**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** పార్టీకి కార్యకర్తలే బలమని బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యమని బిఆర్ఎస్ నేతలు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఖమ్మం, వైరా, మధిర, ఇల్లందు నియోజక వర్గాల సమన్వయకర్తల సమావేశం స్థానిక బిఆర్ఎస్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేస్తుందని ఏ ఒక్క హామీని నెరవేర్చడం లేదన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రతి బూత్‌కు ఇద్దరు కార్యకర్తల చొప్పున నియమించుకుని త్వరిత గతిన సభ్యత్వ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అజయ్‌కుమార్ కోరారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలకు తిలోదకాలు ఇచ్చిందని నాడు బిఆర్ఎస్ అమలు చేసినవి తప్ప ఒక్క సంక్షేమ పథకాన్ని సైతం కొత్తగా తీసుకు రాలేదన్నారు. పాలకులు తమ సొంత పనులు చక్కబెట్టుకోవడంలో నిమగ్నమయ్యారని గత ప్రభుత్వంలో మంజూరైన పనులకు రిబ్బన్ కట్ చేస్తున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో భద్రాచలంను అనుకుని ఉన్న ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయడం కొత్తగూడెం రైల్వే డివిజన్ తదితర అంశాలపై ఇప్పటికే వినతి పత్రాలు ఇచ్చామని రానున్న కాలంలో దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తామన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ చరిత్ర తిరగరాసేవిధంగా కార్యకర్తలు పనిచేయాలని తిరిగి బిఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకుని రావాలన్నారు. జిల్లాలో పదికి పది అసెంబ్లీ స్థానాలు గెలుచుకోవడం అవసరమని అందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. మండల ఇంచార్జీలకు భవిష్యత్తులో పార్టీ ప్రాధాన్యత కల్పిస్తుందని నామ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి తక్కెళ్లపల్లి రవీంద్రరావు, మాజీ ఎంఎల్ఏ హరిప్రియ, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్‌జెసి కృష్ణ, దిండిగల రాజేందర్, పగడాల నాగరాజు, ఖమర్, మంజుల, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సైడ్ డ్రైనేజీ కాలువ పనులను ప్రారంభించిన సర్పంచ్



**ప్రజాపక్షం/కారేపల్లి:** మెయిన్ రోడ్డు సైడ్ డ్రైనేజీ కాలువ పనులను వెంకట్యతండా సర్పంచ్ బానోత్ బుల్లి బుధవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంఘం నిధులతో 350 మీటర్ల మేర కాలువ పనులను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయితీ అభివృద్ధిలో భాగంగా విడతల వారీగా పనులను చేపడుతున్నట్లు తెలిపారు. వేసవి రీత్యా నీటి ఎద్దడి లేకుండా ప్రణాళిక సిద్ధం చేసి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బానోతు దేవుల నాయక్, ఉప సర్పంచ్ బానోత్ రమేష్, వార్డు సభ్యురాలు సంగీత, వాంకుడోత్ కిషన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక డంప్‌ను పట్టుకున్న పోలీసులు

**- నలుగురిపై కేసు నమోదు**

**ప్రజాపక్షం/పాల్వంచ :** అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను పట్టుకొన్న పాల్వంచ పట్టణ పోలీసులు నలుగురు వ్యక్తులపై బుదవారం కేసు నమోదు చేశారు. మునిసిపాలిటి పరిధి కుంటి నాగులగూడెం సమీపంలోని మొర్రేడువాగు దగ్గరలో అనుమతులు లేకుండా పెద్ద మొత్తంలో ఇసుకను నిల్వ చేశారు. అనంతరం పట్టణానికి తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ నాగరాజు తన సిబ్బందితో కలిసి ఇసుక నిల్వ చేసిన ప్రదేశానికి చేరుకొన్నారు. ఇసుక డంప్‌ను పరిశీలించి సీజ్ చేశారు. అనంతరం మూడు టిప్పర్ల ఇసుకను, సంఘటనా స్థలంలో ఉన్నటువంటి, ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్నటువంటి ఓ ఖాళీ టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించారు. అనంతరం విచారణ చేసిన ఎస్ఐ ముగ్గురు డ్రైవర్లు, మరో వ్యక్తి బాదుల్లాపై కేసు నమోదు చేశామని చెప్పారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో బదిలీలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన సంక్షేమ శాఖ జీవో 38 ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులకు కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించినట్లు డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్ తెలిపారు. మొత్తం 123 మందికి బదిలీలు చేయాల్సి ఉండగా 50 మందిని బదిలీ చేశారు. ఇందులో కుక్‌లు 13 మంది, కామాటీలు 17 మంది, వాచ్‌మెన్‌లు 8 మంది, కార్యాలయ సహాయకులు 12 మంది ఉన్నారు. భార్యాభర్తలు, వికలాంగులు, వితంతు మహిళలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

## గురుకుల ఇంటర్ అడ్మిషన్ల కౌన్సిలింగ్



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం పాల్వంచ, రామవరం ఈఎంఆర్ఎస్‌లో కౌన్సిలింగ్ నిర్వహించినట్లు ఆర్‌సీఓ అరుణ కుమారి తెలిపారు. 299 సీట్లకు పదో తరగతి మెరిట్ ఆధారంగా 123 మంది బాలురు, 146 మంది బాలికలకు సీట్లు కేటాయించినట్లు చెప్పారు. విద్యార్థులు వచ్చి సబ్జెక్టులోనే అడ్మిషన్ పొందాలని సూచించారు.

## కౌన్సిలింగ్‌ను పరిశీలించిన గురుకుల ఆర్‌సిఓ



**ప్రజాపక్షం/పాల్వంచ :** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సెక్రటరీ సీతాలక్ష్మి ఆదేశాల మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజన గురుకుల ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి పాల్వంచలోని రామవరం ఈఎంఆర్ఎస్ కళాశాలలో బుదవారం నిర్వహించిన కౌన్సిలింగ్‌ను ఆర్‌సిఓ అరుణ కుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపిసి, బైపిసి, సిఈసి, హెచ్‌ఈసి తదితర గ్రూపులలో గల మొత్తం 299 సీట్లకు 123 బాలురు, 146 మంది బాలికలు పాల్గొన్నారని తెలిపారు. పదవ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లను కేటాయించామన్నారు. సీట్లు పొందిన విద్యార్థులందరికి ఈఎంఆర్ఎఫ్ కళాశాలలో చేరటానికి పూర్తి పారదర్శకంగా సీట్లు భర్తీ చేయటం జరిగిందన్నారు. ఈఎంఆర్ఎఫ్ కళాశాలలో సీటు దొరటమే అదృష్టంగా భావించాలని, ఏ సబ్జక్టులో దొరికినా తప్పనిసరిగా అడ్మిషన్ పొందాలని విద్యార్థుల పేరెంట్స్‌తో అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్ నిశాంత్ క్రిష్టన్, విజయ్ కుమార్, వందనా చౌహాన్, ప్రశాంత్, విజేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం

**-తల్లి, ఆడశిశువు క్షేమం**



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలం సింగారం గ్రామానికి చెందిన మడకం భీమి రెండో కాన్పు నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది పైలెట్ పరమ సునీల్ కుమార్, ఈఎంటీ భాగ్యమ్మ గర్భిణీని పరీక్షించి ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో ప్రసవ వేదనలు అధికం కావడంతో అంబులెన్స్ లోనే భీమి సురక్షితంగా పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, శిశువును ఆళ్లపల్లి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అత్యవసర సమయంలో చాకచక్యంగా స్పందించి సురక్షిత ప్రసవం నిర్వహించిన 108 సిబ్బంది సునీల్ కుమార్, భాగ్యమ్మలను స్థానికులు అభినందించారు.

## మల్లెలమడుగు గ్రామ సమస్యలపై ఎమ్మెల్యే పాయంకు వినతి



**ప్రజాపక్షం/మణుగూరు:** అశ్వాపురం మండలం మల్లెల మడుగు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామ ప్రతినిధులు మరియు స్థానిక నా యకులు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ మరియు ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువెళ్లగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లెల మడుగు గ్రామపంచాయతీ సర్పంచ్ మచ్చా నరసింహారావు, గ్రామ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆళ్లపల్లిలో మెడికల్ షాపుల బంద్ విజయవంతం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆన్‌లైన్ మందుల అమ్మకాలను నిషేధించాలని, కార్పొరేట్ సంస్థలకు భారీ డిస్కౌంట్లు ఇవ్వకుండా నియంత్రించాలని, నకిలీ మందులను అరికట్టాలని ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు ఇల్లందు మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆళ్లపల్లి మండలంలో మెడికల్ షాపులు బుధవారం బంద్ నిర్వహించారు. ఆళ్లపల్లి, మర్కోడు ప్రాంతా ల్లో మెడికల్ షాపులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేశాయని ఇల్లందు యూనిట్ మెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, సీనియర్ కెమిస్ట్ నయీమ్ పాషా తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలకుండా అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. బంద్ విజయవంతానికి సహకరించిన ఆళ్లపల్లి, మర్కోడు మెడికల్ షాపుల యాజమాన్యాలకు, మండల ప్రజలకు నయీమ్ పాషా కృతజ్ఞతలు తెలిపారు.

## రాజకీయ పార్టీల సహకారం అవసరం



**ప్రజాపక్షం/భద్రాచలం :** నియోజకవర్గంలో ఓటర్ జాబితా సవరణ, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీలు బీఎల్ఏలను త్వరగా నియమించి బీఎల్వోలకు సహకరించాలని సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట కోరారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వే, ఫారం 6,7,8 దరఖాస్తుల పరిశీలన, మరణించిన ఓటర్ల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యు అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## బిఎల్‌వోలకు సహకరించాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మణుగూరు తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గంలో 240 పోలింగ్ స్టేషన్ పరిధిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బందితో ఓటర్ సవరణ మరియు మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేక సమావేశం ఐ టి డి ఎ పి ఓ నిర్వహించారు. ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహణకు రాజకీయ ప్రజాప్రతినిధులు బి.ఎల్.ఓ.లకు సహకరించాలని పి ఓ రాహుల్ అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు





**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలో కొత్త బస్టాండ్ ఎదుట బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. టూటౌన్ ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి మధిర వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం తెల్లవారుజామున ఖమ్మం బస్టాండ్‌లోకి వచ్చి తిరిగి బయటకు వస్తుండగా అటుగా వస్తున్న ఆటో బస్సును ఢీకొట్టింది. ఈక్రమంలో బస్సు డ్రైవర్ ఆటోను తప్పించేందుకు ప్రయత్నించగా పక్కనే ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో ముందుభాగం ధ్వంసం కాగా డ్రైవర్ నాగరాజుకు తీవ్రగాయాలైయ్యాయి. బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులు స్వల్పగాయాలతో బయట పడ్డారు. స్థానికులు ఆటో డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా క్షతగాత్రుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.